# అపూర్వ సందర్భాలు

ఆరోజు ఋతుపవనాల తీవ్రత, వురుములూ మెరుపులతోనూ, వాయువేగం డెబ్భయ్ అయిదు కిలోమీటర్ల వేగంతోనూ, వర్షము స్వల్పమూ, అధికమూ, అత్యధికంగానూ వుండేందుకు అవకాశాలేర్పడే సూచనలు ప్రబలంగా వుంటున్నప్పటికీ, యీ సూచనలు సన్నగిలి పోవటమో అసలు లేకుండా కూడా పోవటమో మొదలైన లక్షణాలు కూడా వుంటున్నందుమూలంగానూ, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న వాయుగుండం కొన్ని ప్రత్యేక లక్షణాలేర్పడే పక్షంలో అదిఎటు పయనించినా పయనించగల అవకాశాలుగూడా తగుమాత్రంగా కనపడే పరిస్థితులు కూడా సూచింపపడుతున్న సందర్భాలను బట్టిన్నీ, శ్రోతలకు యీనాడు కొంచెం ఋతుపవనాల కదలికలు చీకాకులూ గజిబిజిలూ కలిగించే సూచనలు బలవత్తరంగా వుండక తప్పకపోవచ్చుననీ, రేడియోవార్త.

అయినా - కూలిజనం, నౌకర్లూ, బంట్రోతులూ, ప్యూన్లూ, చిన్నాపెద్ద వుద్యోగస్తులూ, విద్యార్థులూ, టీచర్లూ, లెక్చరర్లూ, ప్రొఫెసర్లూ, ఆఫీసర్లూ, కోర్టులవారూ, వ్యాపారవర్గాలూ ఎవరి పనులకు వారుచేరి, స్థిమితపట్టం జరిగి, ఆ సమయానికే వీరితాలూకూ వివిధవర్గాలకు చెందిన మహిళలు, స్వల్పంగా స్వేచ్ఛావాయువులు పీల్చుకునే పదకొండుగంటల సమయం కూడా అయింది.

అది రామ్మోహనరావుగారి పెద్ద భవనం తాలూకూ పెద్దహాలు. అందులోకి యిటు వీధివేపునుండి జానకమ్మ ప్రవేశించటం, అటు భవనం లోపలనుండి రామ్మోహనరావుగారి గృహిణి, రాజమ్మ ప్రవేశించడం, వొకే ఘడియ - విఘడియల్లో జరిగింది.

"ఓహో, జానకమ్మగారే? ఏమిటే విచిత్రం! అవుతే యివాళేదో విశేషం వుందన్నమాటే! రాండి, రాండి - యింకానయం, మా యింటి యుద్ధరంగం లోంచి యిప్పుడే బయటపడి కాస్త గాలిపీల్చుకుంటానికి యిటురావటం జరిగింది గాని లేకపోతే - అబ్బబ్బ. యీ కొంపను దారికి తేవటం యీ భూప్రపంచంలో ఎవరివల్లా కాదంటే నమ్ముతారా? యీ డ్రైవర్లు రామయ్యా, రంగయ్యా, బంట్రోతులు సుబ్బయ్యా, సూరయ్యలూ, నౌకర్లు వెంకయ్యా, వీరయ్యలూ, పని మనుషులు రామీ సోమీలూ, వంటమనిషి మాణిక్యం రోజూ నా ప్రాణం నిలువునా తోడుతున్నారంటే నమ్మండి జానకమ్మగారూ. ఆయనకేం యిట్టే కార్లో తుర్రున

పోతారు. మరీ డ్రైవర్లూ, బంట్రోతులూ, నౌకర్లూ, పనిమనుషులూ, వంటావిడా, యీ యింటినో కొలిక్కి తీసుకురాకుండా చూట్టమంటే యీ పంచప్రాణాలు ఎటు పడి పోతయ్యో మీకు నేనేవిధంగా చెప్పాలో తెలియటం లేదంటే నమ్మతారా? ఏమోనమ్మ, యీయనగారికి ఆరువేలు జీతం అని పేరుకేగాని డబ్బు కర్పూర మల్లే ఎటు హరించుకు పోతుందోమరి. అంత పెద్ద వుద్యోగి, అదేం పనులో ఏమో ఒక్క క్షణం ఆయనకూ వూపిరి సలపదూ, నాకా, యీ నౌకర్లూ, యీ భవనం, యింకా నా తలవెంట్రుకలన్ని బయట పనుల్తో జీవితం తరిస్తుంటే, మా విషయం ఎంత వినసొంపుగా వుంటున్నదో ఏం చెప్పను, జానకమ్మగారూ, పేరుకు వున్నది యిద్దరు పిల్లవెధవాయిలేగాని, ఏ లోటూ జరగటానికి వీల్లేదు గదా! ఎంత బంట్రోతులు వాళ్ళ విషయం చూస్తున్నా వాళ్ళు పిచ్చిపిచ్చిగా స్నానాలూ గడ్డలూ వేసుకుంటుంటే చూస్తూ వూరుకోలేను గదా! యింతచేసినా వాళ్ళను స్కూళ్ళకు కార్లో పంపకపోతే నా ప్రాణాన్ని కొరుక్కుతింటారనుకోండి—" అని ఆ భివంతి యజమాన్రాలు, రాజమ్మ చెప్పుకుపోతున్నది కొంచెం ఆయినా, చెప్పవలసింది వుండవలసినంతగా యింకా వుంటున్నా, స్నేహపరంగా అక్కడకు వచ్చి చేరిన, జానకమ్మ విషయం పోకడ యిట్టే గ్రహించి నదై, వుపేక్ష కూడదని- వెంటనే రాజమ్మను మధ్యలోనే వారించి, వుభయులం మట్లాడుకోవలసిందికూడా కొంత వుందని సూచిస్తూ—

"కాదుటండీ మరి. రాజమ్మగారూ, మీరు యింత చెబుతున్నారా, యింత కన్న వెయ్యిరెట్లు నేననుభవిస్తున్నందువల్ల మీ గోల నా కర్థమవుతున్నదిగాని యింకోరవుతే అందులో ఒక్కమాట వినిపించుకోగలరా? నేను వొద్దుమొర్రో అంటున్నా మా వారేమన్నా నా మాట బుర్ర కెక్కించుకుంటారా, ఏమన్నానా! ఆ 'యింపోర్టెడ్' కారు, యీయనగారికి ఎప్పణ్ణుంచో స్నేహితుడైన ఆ అమెరికన్ దొర వాళ్ళదేశం వెళ్ళిపోతూ వీర్ని తీసుకోమని బలవంతం చేస్తే యీయనగారు కాదని ఎట్లా అనగలరో మీరే చెప్పండి, రాజమ్మగారూ? పోనీ, 'యాభై వేలకు' వొక్కనయాపైస తగ్గిందా అంటే, అదీ లేకపోయె! యీయన స్నేహితులంతా ఆ కారు ఎంతో బాగుందని ఎంత మెచ్చుకుంటేమటుకు మనకూ కాస్త కంట్రోలుండాలా, లేదా మీరే చెప్పండి— అదే నే ననేది! మా పెద్దపిల్లవాడి చేతిలో యిప్పటికో రెండు కొత్తకార్లు ఏ కీలు కా కీలు వూడిపోయి ఓ కొలిక్కి వచ్చినై. వాడిసొంతానికో షుమారైన కారొటి పారేస్తే మీ కార్లజోలికి వాడు రాకుండా పోనుగా అని నేను పోరగా పోరగా యిదిగో యిప్పటిగ్గాని ఓ దారికి

రాకపోయె–" అని జానకమ్మ విషయం ప్రారంభిస్తుంటే– "మంచిపని చేశారు! యిదిగో యిలాగే ఓ మంచి మోడల్ మార్కెట్లోకి కొత్తగా వచ్చిందని యీ మధ్య మావారో 'ఫోర్ బాండ్' రేడియో ఒకటి తెచ్చారో లేదో, యీయనగారి తమ్ముడు అది కాస్తాచూసి యీయన ప్రాణంతోడి దాన్ని తన్నుకుపోతే, అంత కన్న అద్భుతంగావున్న 'ఫారిన్' సెట్టొకటి అనుకోకుండా దొరికిందని పది వేలూ పెట్టి దాన్ని యింటికి తెచ్చేదాకా వీరు నిద్రపోలేదుగా! యింత గ్రంథం నడిచిందా మరి, రెండురోజులు తిరగనన్నా తిరక్కుండానే మొహాన కొట్టినట్టు నా తమ్ముడు అమెరికా నుండి వస్తూ యింకో కొత్తరకం, వీటిని తలదన్నే 'రేడియో-కమ్ రికార్డు ప్లేయరు' తెచ్చి మా వారికి ప్రెజెంటు చేసి మరీ చక్కాపోయాడు. చూశారా యీ వింత? యీ మొగవాళ్ళెంత దండగమారి పన్లుచేస్తారో వింటున్నారుగా, జానకమ్మగారూ?" అని రాజమ్మ అంటుంటే–

"అదే నాకు వింతగా వుంటుంది! నిజానికి ఒక్క కుటుంబానికి ఒక్క 'ఫ్రిజ్' కన్న ఎందుకు చెప్పండి, రాజమ్మగారూ? యిప్పటికి 'బ్లూబర్డ్' దొకటీ 'స్పెన్సర్' దొకటీ రెండు 'ఫ్రిజ్'లు వున్నా–అబ్బ–యీయనకెంత దాదస్తమో చూశారా? 'కెల్వినేటర్'అనే కొత్తరకం చాలా 'హైక్వాలిటీ'ది మార్కెట్లోకి వచ్చిందని స్నేహితులంటే, అన్నిటికన్న పెద్దసైజు 'ఫ్రిజ్' ఎనిమిదివేలూ పెట్టి తెచ్చారు, బాగానే వుంది – కాని వీటన్నిట్లో ఏం పెట్టాలో తోచక చస్తున్నాననుకోండి రాజమ్మగారూ" అని జానకమ్మ చెప్పక తప్పకపోతుంటే – నేను కూడా చివరకి యీ మొగవార్ని ఏమీ చెయ్యలేమనే నిర్ణయానికొచ్చా జానకమ్మగారూ. యీ 'షిఫాన్' చీరెలు ఎప్పుడో ఒకటీ రెండుకు మించి నేను వాటిని ఎక్కువగా కట్టటం మీరెప్పుడైనా చూశారా చెప్పండి, జానకమ్మగారూ? అవి కట్టుకున్నది మొదలు వొళ్ళంతా బయటపడ్తున్న మాదిరిగా అనిపించి – అదోరకంగా మనస్సు ఎక్కడకో లాక్కుపోతున్నట్టు వుంటుందామరి – వీరు మాట వరసకన్నా నాకు చెప్పకుండా ఓ స్నేహితుడు అమెరికా వెళ్తుంటే చెప్పారట – ఆ స్నేహితుడు కాస్తా జ్ఞాపకం మరీ పెట్టుకుని, పున్నరంగూ, పున్న డిజైనూ రెండోది లేకుండా పదహేను అమెరికన్ 'షిఫాన్' చీరెలు తెచ్చి యీయన చేతిలో పెట్టి, మరీవెళ్ళాడు, చూశారా? ఒక్కోచీరె అరువందలట. పదిహేను చీరెలూ కలిపి తొమ్మిదివేలట, విన్నారా, జానకమ్మగారూ? అపుకే ఒక్క సుగుణం యిందులో ఏముందంటే, ఆ చీరెలే యిక్కడకొంటే పద్నాలుగువేలకు తక్కువకు దొరకవని రాసిస్తా– ఏమంటారు?" అని రాజమ్మ అంటూ పోతుంటే—

"కొంచెం నిదానించి లోతుగా చూస్తే, అదీ నిజమే మరి! అయినా యిందుకే కదటండీ, నేనంటం! యీ మొగవారేం చేసినా చెల్లుతుందనేగా వీరీరకంగా చేయటం? చూడండి, నాకు నగలపిచ్చి లేదని మా వారికి బాగా తెలుసు. అయినా ఆయన చేతులు వూరుకుంటే, యిహనేం! మొన్నీమధ్యే చైనా బజారువేపు ఎందుకో వెళ్తూ—నేను చెపుతే నమ్మరుగాని, మా వారి హస్తరేఖల్లో ఏమూలో ఎంత ధనమైనా హరించుకుపోయే గీతవుందంటే, నమ్మండి, అందుట్లో ఆ 'బాపా లాల్' నగల షాపులోకి వెళ్తే ఎవరి బుద్ధి ఎటు వెళ్తుందో మనకు తెలియదు గనకనా! వీరు షాపులోకి యిట్లా అడుగు సాంతం పెట్టకుండానే వీరికి తెలిసిన ఆ షాపువాడు ఆ కిందటి రోజే ఓ కొత్త 'పాట్రన్ బాంగిల్స్' వచ్చినయ్యని వీరికి చూపించటం అయ్యోరామ—చెప్పానుగా వీరిచేతి రేఖల్ని గురించీ – ఒక్కో జత మూడు సవరాలట, యిరవై వేల చిల్లరాపెట్టి ఆరు జతలూ తెచ్చారు! యివిగో యీ వేసుకున్నవి అవే, రాజమ్మగారూ, ఎలా ఉన్నాయ్?" అంటూ జానకమ్మ, తళతళ మెరుస్తున్న తన రెండు హస్తాలూ జూస్తుండగా—

"ఏమోనమ్మ, బంగారం నగలు ఏవి చూసినా నాకు అన్నీ బాగానే వుంటయ్! యిదిగో చూడండీ, మీ వారిచేతిలో ఆరేఖేదో వుందన్నారే, దానికి యింకో రెండగుళాల పొడుగురేఖ మావారి చేతిలోనూ వుందిలేండి. అసలు వీరు యీ నగలు ఎన్ని తెస్తారో ఏమో నాకు జ్ఞాపకం కూడా వుండి చావదాయె! సరీగా వారమన్నా అయిందో లేదో వీరా రవ్వల 'నెక్లెసు' తెచ్చి—యిప్పుడు మీరీ నగల ప్రసక్తి తెస్తేనేగాని దాన్ని ఆ గాడ్రెజ్‌లో పెట్టిన విషయం గుర్తుకు రాకనే పోయే, చూశారా, మరి? నగలు వున్నా పెట్టుకునే గీత కూడా వుంటం జాతకం అంటారా, కాదంటారా? యింకో విచిత్రం కూడా ఏమిటంటే యీ నగలు మనం యిలా పెట్టుకుని ఏ బజారుకో వెళ్తామే అనుకోండి– కత్తులు, కఠార్లు, తుపాకులు చూపించి మెడలో వున్నవాట్నె వున్నట్టే తెంచుకుపోతుంటే గుడ్లు మిటకరించి చూస్తున్నామా, లేదా? సరీగా అల్లాంటి సమయాల్లోనే నాకు అనిపిస్తూవుంటుంది– 'నాకే గనక అధికారం వుంటే స్త్రీల నగలకు రక్షణ యివ్వలేని చచ్చు ప్రభుత్వాల్ని డిస్మిస్ చేసి అలా రక్షణ యివ్వగలిగే ప్రభుత్వాల్నే తక్షణం ఏర్పాటు చేస్తాను'–అని నా మతి బండలుగాను, చూశారా జానకమ్మగారూ, అసలు చెప్ప దల్చుకున్న విషయాన్ని ఎలా దాటవేస్తున్నానో? యింకో పదిహేను రోజులకు మా వారి 'పార్ట్నర్'గారు అమెరికానుండి తిరిగివస్తున్న సందర్భంలో 'ఆబిడ్స్ ఒరీ'లో మావారు ప్రత్యేకంగా ఓ పెద్ద పార్టీ ఏర్పాటుచేస్తూ గవర్నరుగార్ని

పర్సనలుగా ఆహ్వానించేందుకు నన్నూ వెంటతీసుకువెళ్తే, ఆ గవర్నరుగారు ఆహ్వానాన్ని వెంటనే అంగీకరించటమే కాదు, మొన్న మీరు కొన్న రవ్వల నెక్లెసు నా మెడలో చూసి చాలా బాగుందని కాంప్లిమెంటు చేస్తే, సిగ్గుపడి చచ్చాననుకోండి, జానకమ్మగారూ!" అంటూ రాజమ్మ చెపుతుంటే—

"కొంపతీసి, సరీగా యింకో పదిహేను రోజులకే మావారు ప్రధాన మంత్రిగార్ని ఆహ్వానిస్తున్న తేదీ మీ పార్టీ తేదీ ఒకేరోజు 'క్లాషు' కావటం లేదు కదా? మావారు 'ఛాంబర్ ఆఫ్ కామర్సు'కు ప్రెసిడెంటు అని మీకు తెలిసే వుంటుందిగా? ఛాంబర్ గోల్డెన్ 'జూబ్లీ' సభలు చాలా గ్రాండుగా, సక్సెసుఫుల్‌గా జరపాలని మా వారు 'ఫ్లయిట్'లో ఢిల్లీ వెళ్ళి ప్రధానమంత్రిగారి చేత ఆహ్వానాన్ని ఒప్పించి మరీవచ్చారు - అని జానకమ్మ పతాకస్థాయిని చేర్తున్న— సరీగా అదే సమయానికి—

"రాజమ్మగారున్నారండీ – నమస్కారమండీ–నేను"– ఆ హాల్లోకి ఒక 'లెదర్ బాగ్'తో ప్రవేశించిన ఆ మహిళ, ఒక రెదురుగా ఒకరు మోహరించి వున్న రాజమ్మా జానకమ్మల సమక్షానికొచ్చి నుంచుని అక్కడ జరుగుతున్న పరిస్థితిని యథాతథంగా బేరీజు వేసుకోగలిగినదై, వచ్చిన పనిని పునస్కరించుకొని, వెంటనే విషయావిష్కరణ చేస్తుండగా—

"నమస్కారం - వుండండి– చూశారా? జానకమ్మగారూ, వీరు తమ పార్టీకి ముందర ప్రధానమంత్రిగారి దగ్గరకే నేరుగా వెళ్ళారట, కాని సమయానికి అక్కడ ప్రధానిగారు లేకపోయిన విషయ పరిస్థితుల్లో మావారు నిరుత్సాహపడక, మన ప్రెసిడెంటుగార్ని కలిసి ఆహ్వానించారు - బహుశవారు నూటికి తొంభై తొమ్మిది ముప్పాతిక పాళ్ళు వీరి పార్టీకి వచ్చే సూచనలు ప్రబలంగా కనిపిస్తున్నవని అనుకుంటున్నాం–" అని రాజమ్మ అంటుంటే—

"మీరు - నాకు రెండు నిముషాలు వ్యవధినిస్తే–" అని ఆ వచ్చిన మహిళ ప్రారంభించుకుంటున్నా—

"వ్యవధా? వుంటమా? చచ్చినా వుండదు–అందులో ప్రధానిగారు వొస్తున్నారంటే మహిళాలోకంలో నాకు నా తలవెంట్రుకలన్ని పనులుంటాయ్"–అని జానకమ్మ అంటుంటే—

"అదే నేననేది–మావారు పిలుస్తే యీ ప్రెసిడెంటుగారు రాక మానడూ– సొంతం మా అంతు తేల్చకా మానడు." అని రాజమ్మ అంటుంటే—

"రాజమ్మగారూ - మీరు ఒక్క సెకండు నామాట వినాలి–" అని వారి

మధ్యలో దూరి, ఆ మహిళ అంటున్నా—

"సెకండ్లా? సెకండ్ల మీదే వుంది వున్న వ్యవహారమంతా – యీ 'హోటల్ చోళా'లో ఎంత మందికి డిన్నర్ ఆర్డరివ్వాలో – నా నెత్తిన యీ 'యిన్విటేషన్ల' గొడవొకటి కూడా వచ్చి పడిందాయె—" అని జానకమ్మ తల పట్టుకుంటుంటే——

"కొంపంటుకుంటయ్ – యిప్పుడు నేను వున్న పళంగా బొంబాయి 'ఎయిర్‌బస్సు'లో వెళ్ళి, హేమమాలిని భరతనాట్యం ప్రోగ్రాం ఫిక్సు చేయకపోతే యీయనగారు నా గొంతు అమాంతం రెండు చేతుల్తో పిసికేస్తారు—" అంటూ రాజమ్మ రెండు చేతులూ పైకెత్తుతుండగా—

"రాజమ్మగారూ, యీ వొక్కమాట వినండి, చాలు – వారంలో జరగ బోయ్యే మా రవీంద్ర లైబ్రరీ డైమండు జూబిలీ సభలకు—" అని ఆ మహిళ సాధ్యమైనంత రాజమ్మ చెవిదగ్గర నోరుపెట్టి బిగ్గరగా 'సైరన్' వూత్తుంటే—

"అబ్బ – నా చెవి కొరుకుతున్నది యీవిడెవరో- ఎవరమ్మా నువ్వూ, నా చెవిలో శంఖం వూత్తావు యిప్పణ్ణుంచే—" అని రాజమ్మ, తూటుపడిన చెవి సాఫు చేసుకుంటుంటే—

"అవును, రేపు మా 'ఛాంబరు గోల్డెన్ జూబిలీ' విందులో ఎవరూ శంఖాల్లు వూదకుండా యిప్పట్నుంచీ జాగ్రత్తపడాల్సిందే? యింకానయం, అమెరికాలో యీ రవిశంకర్ను రేపటి విందులో సితారు వాయించటానికి ముందుగానే 'బుక్' చేశాను కాబట్టి సరిపోయిందిగాని, లేకపోతే మావారు చెవ్వులో మృదంగం వాయిం చరూ – ఏమండోయ్ – యీవిడె నా వేపుకూడా చూస్తున్నది, నన్నుకూడా శంఖు భరతం పట్టిస్తుందా ఏమిటి, ఖర్మ?" అంటూ జానకమ్మ తన గుండెల మీద చేతులు అడ్డం పెట్టుకుంటుంటే—

"యీ లైబ్రరీ రవీంద్ర సభలు చాలా పెద్ద ఎత్తున జరిపించకపోతే—" అంటూ తన రెండు చేతులూ రాజమ్మ రెండు భుజాల మీద మోపి, ఆ మహిళ అంటుంటే—

"యిదేమిటే, యీవిడె నా రెండు దెబ్బలు పట్టుకు తోస్తున్నదీ—ఏవ మ్మోవ్, నవ్వు ఏమను కుంటున్నావో, మావారు 'అఖిల భారత బాక్సింగ్' సంఘా నికి ప్రెసిడెంటు – నీ వొళ్ళు చితగ్గొట్టేయిస్తాను—" అంటూ ఆ మహిళను రాజమ్మ తప్పించుకుంటుంటే—

"సందర్భం రానే వచ్చింది గనుక చెప్పేస్తున్నాను – కిందటి సంవత్సరమే

వారు రోమ్‌నగరంలో జరిగిన 'వరల్డ్ ఎథిలెట్స్' ఎస్సోసియేషన్ మహాసభలకు భారతదేశం నుండి శాశ్వత ప్రతినిధిగా వెళ్ళొచ్చారు – కావాలంటే రుజువు పరుస్తాను – గనుక నా విషయంలో మటుకు నా గుండెలమీద చేతులు పెట్టావంటే తగినశాస్తి చేయిస్తాను–" అని జానకమ్మ అంటుంటే—

"ఒట్టు – నేనే పాపం ఎరగను – అస్సలు ముందు మీరు నాకు షన్న మతి పోగొడ్తున్నారు – యీ లైబ్రరీ జూబ్లీ వీరేంద్ర మహాసభలకు–" అని ఆ మహిళ షుమారుగా అరుస్తుంటే—

"తెల్లవారి లేచింది మొదలు యీ 'లైబ్రరీ' అంటూ వీళ్ళు ముద్దుమొర్రో అంటున్నా మూటలమూటలు పుస్తకాలు తెచ్చి మీద కుమ్మరించి పోతున్నారు! అందుట్లో మావారు 'యావద్భారత గ్రంథాలయం'కు ఆజన్మ సభ్యులు కూడానా— యిల్లంతా పుస్తకాల మయం – కాలు తీసి కాలు పెట్టేలోపల మీద విరుచుకు పడ్తున్న య్యీ పుస్తకాలు – వూరుకున్న కొద్దీ వీళ్ళు ఎలా పెచ్చుమీరి పోతున్నారో చూశారా, జానకమ్మగారూ?" అని రాజమ్మ అంటుంటే—

"యింకా నయం – యిప్పటిదాకా నా కెవరూ తోడు లేరనుకుంటున్నా, చూశారా? యీయనగారీ మధ్య జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో సాహిత్య గోష్ఠి చర్చలకు అధ్యక్షుడుగా వెళ్ళివచ్చినప్పట్నుంచీ యిల్లంతా యీ పుస్తకాలు పుట్టలు పెరిగినట్టు పెరిగేవి పెరుగుతుంటే, ఏ గ్రంథాలయాల వాళ్ళో వచ్చి కనపడ్డవి కనపడ్డట్టు ఒళ్ళమీద పట్టించుకుని ఆ పుస్తకాల్ని తీసుకు చక్కాపోతున్నారు–" అని జానకమ్మ అంటుంటే—

"ఈశ్వరానుగ్రహం వల్ల రాజమ్మగారితో పాటు జానకమ్మగార్ని చూసే మహాభాగ్యం కూడా కలిసొచ్చింది – మా 'జూబ్లీ డైమన్ల' పార్టీకి మీరుభయులూ–" అని ఆ మహిళ స్వాగతిక ముద్రతో రెండు చేతులూ జోడించి అంటుంటే—

"కొంపలంటుకున్నాయ్ – చూశారా, జానకమ్మగారూ? నేనీరకంగా టైము వేస్టు చేస్తుంటే యింకేమున్నావుందా. మీరే చెప్పండి? యీ గవర్నరుగారి పి.ఏ.ను కలిసి మాట్లాడవలసింది ఎంత వుందో – నా మతి మండిపోనూ–" అని రాజమ్మ అంటుంటే—

"మీరేమిటి – మీ కన్న వెయ్యిరెట్లు నా పొజీషను ప్రమాదంగా వుందంటే, నమ్ముతారా? నా బుర్ర పూర్తిగా చెడింది– ఎంతపనైందో చూశారా? అసలే యీ ప్రధాన మంత్రిగారికి చేయవలసిన ఏర్పాట్లతో వుక్కిరి బిక్కిరై

చస్తుంటే - నా రవ్వల దిద్దులూ, రవ్వల గాజులూ, రవ్వలుంగరాలు ఎక్కడ పెట్టానో జ్ఞాపకం వచ్చి చావటం లేదు, ఎలా చచ్చేది?" అని జానకమ్మ అంటుంటే—

"యిక్కడే నాకు మండేది! మీకు దేవతల్లే వచ్చి యింకా జ్ఞాపకం చేయక పోతే నాగతేంకానూ? ఎంత సేపటికీ యీనగల్ని వాడుకున్నన్ని వాడుకుని ఆ పనైనాక వాటిని ఎక్కడెక్కడో గిరవాటు వేయటం ఎంత దురలవాటో చూశారా అండీ? అటు వీరి పార్టీకి ప్రెసిడెంటుగారు వస్తూవుంటం యిటు నేను తగుదు నమ్మా అంటూ - ఆ టైముకు ఏనగలూ కనపడక దిగదుడుపుగా వారికెదురు వెళ్ళటం - అవ్వ - ఎంత సిగ్గుచేటు-" అని రాజమ్మ అంటున్న సమయంలో-

"రామ్మోహనరావుగారున్నారా అండీ? మీరు వారి భార్య రాజమ్మగారను కుంటా - యిదిగో ఆర్డరు - మీ యిల్లు సోదా చేయటానికి వచ్చాం — వీరెవరూ? రంగబాబుగారి భార్య జానకమ్మగారా? మంచిది-" అని యింకా ఆరుగురు విచిత్రంగా చూస్తున్న మనుషుల్తో మెరుపు మెరిసినట్టు అక్కడ ప్రత్యక్షమైన ఆ పెద్దమనిషి, అదో ధోరణిలో వచ్చిన విషయం వినిపించగా—

"ఏమిటి జానకమ్మగారూ, ఆయన గారంటున్నదీ? మీరు దొంగల ముఠా వారేమిటి, ఖర్మ-" అని రాజమ్మ అంటే—

"తప్పకుండా మీరు వారే - యీ సినిమాలు చూసిచూసి చచ్చుపీనుగలు యిలా తయారైనారు, వీళ్ళ మొహం మండ! ఆడవాళ్ళం వొంటరిగా వుంటం చూసి నోట్లో గుడ్డలు కుక్కి అందినవందినట్టు దోచుకు పోతారు-" అని జానకమ్మ అంటే-

"మీ ధోరణి చూస్తుంటే సినిమాలు మీ రక్తంలో బాగా యిమికినట్టుగా వుందే - వూఁ కానీయండి మీ పని-" అని ఆ వ్యక్తి మిగతా ఆరుగుర్ని ఓ పక్కలో ఆజ్ఞాపించగా——

"యిది కలా, మాయా, నిజమా, జానకమ్మగారూ? అదేదో ఆర్డరన్నాడు, మీరన్నా దాన్ని సరీగా చూశారా జానకమ్మగారూ? ఏమయ్యోవ్, మీరు నిజంగా ఎవరైనా గవర్నమెంటు తాలూకా అధికారులవుతే, మావారికి గవర్నరుగారు ప్రాణస్నేహితులు, మిమ్మల్ని సెకండ్లమీద డిస్మిస్ చేయిస్తాను, ఏమనుకుంటున్నారో-" అని రాజమ్మ అంటే——

"అదే, యిందాకట్నుంచి ఆలోచిస్తున్నా — నిజంగా మీరు వారవుతే, మా వారు యిప్పటికప్పుడే ప్రధానమంత్రిగారితో ఫోన్లో మాట్లాడి, వీళ్ళని నేరుగా

యిక్కడ్నుంచే రాయవేలూరు బందిఖానాలకు పంపించేయగలరు — వీళ్ళకి విషయం ఎలాతెలుస్తుంది, పాపం? ఏమర్రా, మీరు నిజంగా గవర్నమెంటు తాలూకువారా, ఏమిటి? ఏమైనా మన మర్యాద మనం వుంచుకుంటానికన్నా వీర్ని కాస్త కూర్చోమని, కొంచెం కాఫీ గట్రయిప్పిస్తే మంచిదికదూ, రాజమ్మగారూ?" అని జానకమ్మ, రాజమ్మను కన్నుకొడ్తుంటే——

"మా 'జూబ్లీ లైబ్రరీ రవీంద్రులు' మళ్ళీ వస్తారు. అందరికీ వందనాలు-" అంటూ ఆ మహిళ, జోడించిన రెండు చేతుల్తో నుంచున్న పళంగానే ఒక్కో అడుగు వెనక్కి వీధిగుమ్మం వైపు వేసుకుంటూ వెళ్తూ వుండగా——

బయట- "ఋతుపవనాల తీవ్రత ఆనాటికి అధికమూ, అత్యధికమూ, స్వల్పముగా కూడా లేకుండా వాతావరణం, సామాన్యమూ, సర్వసామాన్యంగానూ వుండగల సూచనలు స్పష్టంగా కనుపిస్తున్నవని" ప్రాంతీయ రేడియో వార్త.

★